# వి. సి. ఆర్

అపర్ణ టెంకాయ కొట్టి బొట్టు పెట్టింది. వెంటనే అప్పారావు స్విచ్ ఆన్‌చేశాడు. టీవిలో బొమ్మ కదలాడసాగింది. చూస్తున్న అందరూ ఆనందంగా చప్పట్లు కొట్టారు. గర్వంతో అప్పారావు ఛాతి అరంగుళం పెరిగింది.

"అప్పారావు అన్నది సాధించాడు" ఆఫీసర్ అభిషేక్ అభినందించాడు.

"మాంచి టేస్టు వున్న వ్యక్తిలేండి" టైపిస్టు రమాదేవి మెచ్చుకుంది.

"మావంగారి అండదండలు దండిగా ఉన్నాయి" కుళ్ళుబోతు కూర్మారావు వ్యాఖ్యానించాడు.

"ఈ వీధిలో అందరికంటే ముందుకొని హీరో అనిపించుకున్నారు." కాలేజి కుర్రది సుకన్య చెప్పింది. ఈ లోగా ముందుగా సిద్ధంచేసిన తీపి – కారా, ఐస్‌క్రీము పళ్ళేలు అపర్ణ అందించింది.

ఇంతాచేస్తే అది పుట్టినరోజు పండుగ వేడుక కాదు. అప్పారావు వీడియో రికార్డ్‌ప్లేయర్ కొన్నాడు. అతని జీవితా శయాలలో అది ఒకటి. అప్పుచేసి వడ్డీకి నెలవారి కొంత సొమ్ము కట్టడానికి ఒప్పందం చేసుకొని వి.సి.ఆర్ కొనేశాడు మామూలుగా అప్పారావు తను చేయబోయే ఘనకార్యం పదిమందికీ కాకపోయినా కొందరు మిత్రులు ఆహుతులు – అనాహూతులు అక్కడకు విచ్చేశారు.

అపర్ణ కూడా మంచి వయసులో ఉంది కాబట్టి – ఉత్సాహంగా అందరికీ ఫలహారాలు అందివ్వడానికి ఆమోదం.. పూర్తి సహకారం ఇచ్చింది.

"అప్పారావు!– నాకో సందేహమోయ్!" ఆఫీసర్ అభిషేక్ నాందీగా పలికాడు.

"చెప్పండి – అయినా మీసందేహం తీర్చేంతటి పెద్దవాడినా?" సందేహించాడు అప్పారావు.

"ఎవరో చెబితే విన్నాను. వి.సి.పీ.లు చాలా చీపటకదా ! నువ్వేమో పధ్నాలుగుపైన పెట్టి వి.సి. ఆర్. కొన్నావు ! ఎందుకు అలా చేశావు?" అభి షేక్ తన ధర్మ సందేహం అడిగాడు.

ఇంతలోనే కుతూహల సుందరి అయిన రమాదేవి కూడా అడిగింది. "అది కొనుంటే మీకు ఎంతలేదన్నా ఏడు వేలకుపైగా మిగిలి ఉండేది – ఎందుకిలా తగలేశారు?"

"నువ్వు సాధారణంగా మోసపోవే!" ఎవరో నీకు టోపివేశారనే ఉద్దేశ్యాన్ని తన మాటల్లో వ్యక్తంచేస్తూ కూర్మారావు తెగఆనందపడిపోయాడు.

"అందరిలాగా వి.సి.పి. కొంటే మా అప్పారావుగారి ప్రత్యేకత ఏముంటుందండి!" అని ఆశ్చర్యపోయింది సుకన్య.

"నే చెబితే వినలేదండి." అపర్ణ ఫిర్యాదు చేసింది.

"అక్కడే మీరంతా పొరపాటు పడుతున్నారు." అప్పారావు గొంతు సవరించుకొన్నాడు. "మీరన్నట్లు వి.సి.పి. చాలా చవకేగాని, వాటి పనితనం అంత తృప్తిగా ఉండిఛావదు. ఏదో బొమ్మంటూ కనిపిస్తుంది. మాది కలర్ టీ.విఅని తెలుసుగా మీకు. మా టి. విలో వి.సి.పి. పెడితే కాసేపటికి బొమ్మకున్న కలర్‌పోతుంది. అయ్యా! అది మా టీవి డిఫెక్ట్ కాదు వి.సి.పి. గుణమే అంత! తరువాత బొమ్మను కూడా వి.సి.ఆర్ చూపించలేదు. ఏతావాతా చెప్పొచ్చేదేమంటే ఒకే క్యాసెట్‌ను వి.సి.ఆర్. వి.సి.పికంటే స్పష్టంగా మెరుగ్గా చూపిస్తుంది. చివరిదైనా ముఖ్యమైన పాయింట్ ఏమిటంటే – కాస్త ఆగాడు." వాళ్లు ఆసక్తిగా అతన్నే గమనిస్తున్నారు.

"నేను కళా హృదయుడ్ని."

సుకన్య అతని ఛాతీ వంక చూసింది అక్కడేమన్న కనిపిస్తుందేమోనని.

"అంటే టి.వీలో మంచి ప్రోగ్రాములొస్తే రికార్డు చేసుకుంటాను" గర్వంగా ముగించాడు అప్పారావు.

"ఆ( !టి.వీ లో మంచి ప్రోగ్రాములు రావడమేమిటి! నీ మొహం?" చప్పరించాడు కూర్మారావుఅదేదో బూతు మాటలాగా.

"మాంచి వెస్టరన్ మ్యూజిక్, డ్యాన్సులు రికార్డు చేసుకోవచ్చు." షేకవుతూ చెప్పాడు అభిషేక్.

"పొరపాట్న మంచి సినిమాలేస్తే, ఎలక్ట్రిసిటీ వాళ్ళ పుణ్యాన కరెంట్ ఉంటే - రికార్డు చేసుకోవచ్చు" రమాదేవి కలలు కంది.

"చిత్రలహరి రికార్డ్ చెయ్యవచ్చు. చిరంజీవి స్టెప్స్ చూసుకోవచ్చు ఎంచగ్గా" సుకన్య ఆనందపడిపోయింది.

ఆ తర్వాత కొన్ని రోజులు అప్పారావు జీవితంలో మధురంగా గడిచిపోయాయి. రోజుల్ని గంటల్లాగా గడిపేడు. తెచ్చిన కేసెట్టు తేకుండా కొత్త సిన్మాలవి, పాత సిన్మాలవి అద్దెకు తెచ్చి ఇంట్లో వాళ్ళకు, చుట్టుపక్కలవాళ్ళకు కనువిందుచేశాడు.

ఓ రోజు అభిషేక్ తన గదిలోకి పిలిపించాడు అప్పారావును.

"ఓ చిన్న ఆబ్లిగేషన్"

"పెద్దదైనా ఫర్లేదు" తన విధేయతను తెలిపాడు.

"ఏంలేదు - మా ఇంటికి మా మరదలు - బ్రదర్ఇన్‌లా వచ్చారు. మామిసెస్ ముచ్చట పడుతున్నది సినిమాలు చూడాలని- అందుకని" అభిషేక్ అతన్ని చూస్తున్నాడు.

"దాందేముంది సార్ !సినిమాలు చూడండి మంచివే ఉన్నాయి ఊళ్ళో!" అప్పారావుకు అర్థంకాలేదు.

"అదికాదు - ఈ వెధవ హాళ్లల్లో చూడాలంటే విసుగ్గా ఉంటున్నది. రౌడీలు అల్లరి చేస్తూ ఉంటారు. అందుకని టీవీ చూద్దామని. నీ వి. సి. ఆర్ ఇస్తావా? హఠాత్తుగా అడిగాడు."

అప్పారావుకు పచ్చి వెలక్కాయ గొంతులో పడ్డట్టయింది.

అబ్బే ఎక్కువకాలం అక్ఖరలేదు. వాళ్లురెండుమూడు రోజుల్లో వెళ్లిపోతారు. మా ఆవిడ నన్ను రెంట్‌కు తీసుకు రమ్మంది. నేను చెప్పాను - మన శిష్యుడు అప్పారావు వి. సి. ఆర్. కొన్నాడు మనం అద్దెకు తెచ్చుకుంటే అతనికి కోపం వస్తుంది ఇక మీదట మనింట్లో పచ్చి గంగ కూడా ముట్టడని. దీంతో మా ఆవిడ మెత్తబడి మీ దగ్గర నుండే తెమ్మంది - అన్నట్లు కొన్ని కేసెట్లు కూడా కొన్నావు కదా!" అభిషేక్ గుర్తుకు తెచ్చుకుంటూ అడిగాడు.

ఏం చెప్పాలో తోచక తలాడించాడు పైకీ కిందకి.

"పాపం! నీకెందుకులే శ్రమ - నేవచ్చి తీసుకెళతాను. మళ్ళీ అంత దూరం నుండి వి. సి. ఆర్. తెచ్చిపెట్టి వెళ్ళాలంటే బోర్ కొడుతుంది" బోల్డు జాలిపడిపోయి చెప్పాడు అభిషేక్.

ఇంటికొచ్చింతర్వాత విషయం చెప్పాడు అపర్ణకు. "ఎంత ఆఫీసరైతే మాత్రం ఎందుకు ఒప్పుకున్నారండి! అదా అసలే సున్నితమైంది - ఎవరుపడితే వాళ్ళు ఇష్టమొచ్చినట్లునొక్కితే చెడిపోతుంది. రిపేరొస్తేంచా - ఇక్కడ సరిగా చేసే వాళ్ళు కూడా లేరు" ఆమె స్థాయి పెంచి చెప్పింది.

ఈ లోగా స్కూటర్ మీద వచ్చివాలాడు అభిషేక్.

"ఏమ్మా! బాగున్నావా! మా ఆవిడ మీగురించి ఒకటేపొగుడుతుంది" నవ్వుతూ పలకరించాడు అభిషేక్.

అపర్ణ మొహం సువర్ణమైంది.

"రండి సార్– కూర్చోండి – మీ గురించే మాట్లాడుకుంటున్నాం" అప్పారావు చెప్పాడు.

"ఏంటో! మీ ఆయనకు నేనంటే భలే భక్తి. ఇలా మా మరదలు వాళ్ళు వచ్చారని చెప్పానో లేదో వి.సి.ఆర్ తీసుకుపోయి చూడమని ఒకటే పోరు పెట్టాడు."

అపర్ణ గుడ్లురిమి భర్త వంక చూసింది.

"అప్పారావు! విసిఆర్ స్కూటర్ బాక్స్‌లో పట్టదుకదా?"

"అబ్బే పట్టదండీ – డ్యామెజ్ అవుతుంది."

"అయితేనువ్వుదాన్నిపట్టుకుని వెనకాల కూర్చో! ఎలాగూ మా మరదల్నిచూసిననట్లుంటుంది. వి.సి.ఆర్. మాకు నేర్పినట్లవుతుంది" అభిషేక్ మందహాసంతో అడిగాడు.

అప్పారావు గత్యంతరం లేక ఒప్పుకోవలసివచ్చింది. పాపాయిలా దాన్ని ఒడిలో పెట్టుకొని ఆయన స్కూటర్ వెనకాల కూర్చున్నాడు అప్పారావు.

వారం రోజులు తర్వాత కూడా విసిఆర్ ఇంటికి రాకపోయేసరికి ఆఫీసర్ని అడిగాడు అతను.

"సార్! ఇవ్వాళ టీవిలో మంచి ప్రోగ్రాం ఉంది మా ఆవిడ రికార్డు చేసుకోవాలంటున్నది. విసిఆర్. కావాలి సార్."

"ఏం ప్రోగ్రామో!" ఆశ్చర్యంగా అడిగాడు.

"అర్ధరాత్రి!" సినిమా పేరు చెప్పాడు.

"అర్ధ్రరాత్రి మేలుకుంటావా! ఆరోగ్యానికి మంచిది కాదయ్యా!" అభిషేక్ అప్పారావు ఆరోగ్యమే తన ఆఫీసుకు శ్రీరామరక్షన్నట్లు హెచ్చరించాడు.

"అబ్బే! టైమ్ సెట్ చేసి మేం నిద్రపోతాం సార్ – అదే రికార్డ్ చేస్తుంది ఆటోమేటిక్‌గా. రేపు చూస్తాం" చెప్పాడు.

"అలాగా! మా ఆవిడ రోజూ చెబుతున్నది విసిఆర్ తీసుకుపొండని – వెధవది దున్నపోతులా బరువుగా ఉంది. ఆ గాడిద బరువు మోయలేకతేలేదు. సాయంత్రం వచ్చి ఏమనుకోకుండా తీసుకుపో అభిషేక్ ఉదారంగా చెప్పాడు.

అప్పారావుకు ఆ బాధ్యత తప్పలేదు.

కాని ఆ రాత్రి అతని తల వాచిపోయింది అపర్ణ సాధింపులకు – "ఎంత ఆఫీసరైతే మాత్రం ఏదడిగితే అది యిచ్చేస్తారా?" అని దీర్ఘాలు తీసింది.

"ఆబొమ్మ చూడండి ఎంత ఛండాలంగా వస్తోంది! అసలా క్లారిటి ఏదీ? నాశనమైపోయింది."

"ఊరుకోవే! రిపేర్ చేయిస్తాను."

"చేయిస్తే మటుకు ఒరిజినాలిటీ వస్తుందా?"

"సర్లేవే! ఇంకెవ్వరికి ఇవ్వను. బుద్ధి తక్కువైంది" లెంపలేసుకున్నాడు.

కాని ఆ మర్నాడే మళ్ళీ బుద్ధి తక్కువయింది అతనికి. లంచ్‌లో రమాదేవి మెలికలు తిరిగిపోతూ అతని దగ్గరకొచ్చింది.

"ఏంటి? ఇవ్వాళ చాలా హుషారుగా ఉన్నారు?" అడిగాడు.

"ఏదో మీ అభిమానం- నే మామూలుగానే ఉన్నాను."

"మీలో ఏదో మార్పు కనిపిస్తున్నది."

"ఏమో మరి! మీదయ ఉంటే ఓ పందెం గెలుస్తాను"

"బావుంది- మీరు పందెం గెలవడానికి నాదయ ఎందుకు? కావాల్సింది అదృష్టం."

"కాదండి బాబూ అది ఖచ్చితంగా మీ పైనే ఆధారపడి ఉంది - నే పందెం గెలవాలంటే మీ సహకారం కావాలి." చెప్పింది.

"వింతగా ఉందే! అయినా మీకు సహకారం ఎప్పుడూ అందిస్తూనే ఉన్నానుగా!"

"ఈ పందెం నే గెలిస్తే మా ఆయన చిత్తవుతాడు" గర్వంగా చెప్పింది.

"పోయి పోయి మీ ఆయనతోనే కాశారా?"

"ఆఁ!"

"ఇంతకీ ఏం పందెం?"

"మీరు గెలిపిస్తానంటే చెబుతాను"

"ట్రైచేస్తాను - చెప్పండి."

"ప్రామిస్!"

"ప్రామిస్- మిస్! చెప్పండి."

"మీరేమి అనుకోవద్దు - మావారేమన్నారంటే- అప్పారావుగారు పిసినారి-ఎవరికీ నయాపైసా సాయం చెయ్యడూ -"

"వ్వాట్! వారికి నా మీద అంత సదభి ప్రాయం ఎలా కలిగింది?" దిమ్మరపోయి అడిగాడు.

"ఆ! నేను బాగా ఖండించాను - లేదూ ఆయనది చాలా విశాల హృదయం- ఏమడిగినా ఇస్తాడు - మొన్న జలుబు చేస్తే రుమాలు కూడా ఇచ్చారు అని చెప్పాను. అయినా ఆయన వినలేదు-చివరికి పందెం కట్టుకొన్నాం."

"ఏం పందెం?" అడక్కుండా ఉండలేకపోయాడు.

"అప్పారావు ఇంట్లోనుంచి విసిఆర్ తెచ్చుకుంటానని నేను- తేలేనని ఆయన! నే ఓడిపోతే ఓ నెల రోజులు నేనే వంట చేయాలి - ఆయన ఓడిపోతే ఓ నెలరోజులు నా బట్టలు కూడా ఉతకాలి అదీ పందెం!" ఆమె చెప్పింది.

అప్పారావుకు చీకట్లు కమ్మాయి.

"అప్పారావుగారూ! మీరు నాకింత ఆత్మీయులై ఉండి నన్ను పందెం ఓడి పొమ్మంటారా? ఓ నెలరోజులు వంట చేయమంటారా? పెళ్ళయింతరువాత బొత్తిగా వంట చేసే అలవాటు తప్పిపోయింది. ప్లీజ్!" బుడిబుడి రాగాలు తీసింది రమాదేవి.

కాసేపటికి అప్పారావు కరిగి పోయాడు.

కానిఅపర్ణ చేత రెండ్రోజులు ట్యూషన్ చెప్పించుకోవలసి వచ్చింది అప్పారావుకి.

దేముడు దయతలచినట్లు ఆమె రెండురోజుల్లోనే వాపసు ఇచ్చింది. దానికి కారణం తన మీద సానుభూతి కాదని డబ్బులిచ్చి క్యాసెట్లు అద్దెకు తెచ్చుకోవడం ఆమెకు ఇష్టంలేదని - అతనికి అర్థమయింది. రిపేరుకు ఓ రెండొందలు ఖర్చయ్యాయి.

గుండెలనిండా ఓ రోజు ఊపిరి పీల్చుకున్నాడో లేదో కూర్మావతారం పట్టుకున్నాడు.

"ఏం అప్పారావు కులాసానా? విసిఆర్ బాగా పనిచేస్తున్నదా?"

"ఊ! నీ సెల్క్షన్ అల్లాటప్పానా? బాగానే ఉండి ఉంటుంది - నీ విసిఆర్ బాగా పని చేస్తున్నది చాలామంది చెప్పార్లే."

"పనుంది - వెళ్ళొస్తానండి."

"అన్నట్లు విసిఆర్ అంటే గుర్తొచ్చింది- మా ఆవిడ కూడా కొందామంటున్నదోయ్ -"

"సంతోషం - వెంటనే తీసుకోండి."

"తీసుకుంటూ - తీసుకునే ముందు ఓసారి నీ విసిఆర్ ఇస్తే మా ఆవిడ చూస్తుంది. అది చూసిందో నువ్వుకొన్న బాండే కొనమని చెబుతుంది."

మనుసులో కూర్మావతారాన్ని తిట్టుకున్నాడు."

"ఏంటి మొహం అలా పెట్టావు? ఆరోగ్యం బాగాలేదు?"

"అబ్బే కాదండి - విసిఆర్‌తో అర్జెంట్‌పని ఉంది. మీకు ఎలా చెప్పాలా అని."

"పోన్లే - రేపిద్దువుగాని -నువ్వెక్కడికి పోతావు- నే నెక్కడికి పోతాను కూర్మావతారం చిద్విలాసంగా చెప్పాడు."

అప్పారావుకు ఒళ్ళు మండిపోయింది.

"సారీ! నా విసిఆర్ నే నెవరకీ ఇవ్వదలచుకో లేదు కుండ బద్దలు కొట్టినట్లు చెప్పిన అప్పారావు మాటలు విని ఓ క్షణం స్థాణువైనా వెంటనే తెప్పరిల్లాడు కూర్మారావు."

"అదేంటోయ్ మొన్నేగా రమాదేవికి ఇచ్చావు."

"ఎవరు చెప్పారు?"

"ఎవరో ఏమిటి - నే చూశాగా ."

"పొరపాటు ఇచ్చి ఉంటా."

"అవునవుననూ - మన ఆఫీసర్ గారి దగ్గర కూడా నీ విసిఆర్ చూసినట్లుందే అర్థోక్తిగా అన్నాడు."

కోపం కట్టలు తెచ్చుకుంది అప్పారావుకి- అన్నిటికీ ఆరాలు.

"అవును, ఇచ్చాను - రమాదేవికి ఇచ్చాను- ఆఫీసర్ అభిషేక్‌గారికి ఇచ్చాను, అయితే ఇప్పుడేమిటి?"

"అదే చేత్తో మాకూ ఓ రెండు రోజులిస్తే - సంతోషిస్తాం."

"సారీ నా పాలసీ మార్చుకున్నాను - ఇంకెవ్వరికీ ఇవ్వను."

"అంటే... నే నంత పనికిరాని వాడినన్నమాట."

"మీ గురించి ఎందుకలా అనుకుంటారూ?"

"లేకపోతే ఏమనుకోవాలి? ఆఫీసర్ని కాకా పట్టడానికి ఆయనగారికి విసిఆర్ వారం ఇచ్చావనుకోవాలా? రమాదేవిని మంచి చేసుకోవడానికి ఆమెకిచ్చావనుకోవాలా."

"కూర్మావతంగారూ !నాలుక దగ్గర పెట్టుకుని మాట్లాడండి."

"నానోరైతే మూయిస్తావు - అందరూ ఏమనుకుంటున్నారో విను- నీకే తెలుస్తుంది - పిల్లి కళ్ళుమూసుకు పాలు తాగుతూ తన్నెవరూ చూడ్డం లేదనుకుంటుంటుంది పాపం."

"నా విసిఆర్ నా ఇష్టం –" అంటూ ఇంక అతన్ని రెచ్చగొడితే ఎటువంటి మాటలు వినవలసి వస్తుందోనన్న భయంతో ఇంటి ముఖం పట్టాడు.

ఇంటి దగ్గర అపర్ణ చిటపటలాడిపోతోంది.

"దానికెంత పొగరో చూశారా?" రాగానే అడిగింది.

"చూడలేదు, ఎవరికి, పొగరు?"

"అదే – మిడిసి పడిపోతోందే దానికే –"

"ఎవతె అది–"

"మీ సుకన్య!" వ్యంగ్యంగా అంది.

"మధ్యలో నన్నెందుకు లాక్కొస్తావు?"

"లేకపోతే విసిఆర్ ఇవ్వనంటే ఏమంటుందో తెలుసా – ఊళ్ళో మీరొక్కరే కొనలేదు – చాలా మంది కొన్నారు. కావాలంటే నాలుగు డబ్బులు పారేసి అద్దెకు తెచ్చుకోగలం అంది" చేతులూపుతూ అభినయిస్తూ చెప్పింది.

"మరి అద్దెకు తెచ్చుకొమ్మనకపోయావా?"

"అలా కాదట, మీరు ఊఊ తెగ బాధ పడిపోతారనీ, మిమ్మల్ని ఉద్ధరిద్దామని మనల్ని అడిగిందట–" చెప్పింది.

ఇంతలో సుకన్య దూకుడుగా లోపలికి వచ్చింది.

"మీరే చెప్పండి అప్పారావుగారూ ఇన్నాళ్ళూ కలసిమెలసి ఉన్నాం అని చనువుకొద్దీ ఓ రోజు విసిఆర్ ఇమ్మంటే ఇంత రాద్ధాంతం చేయాలా? మీరే కాదుకొనేది – మేమూ కొనగలం" అంటూ అతని మీద విరుచుకు పడింది.

"సుకన్యా! ఎందుకీ గొడవ – నీక్కావాలంటే పట్టుకుపో" ఉదారంగా అన్నాడు సర్దిచెబుదామని.

"మీ బోడివిసిఆర్ ఎవరిక్కావాలి? ఇన్ని మాటలు పడ్డ తర్వాత తీసుకుంటామా? మాకూ చీమూ నెత్తురూ ఉన్నాయి."

"ఇదిగో బోడీగీడీ అనవాకు. మర్యాదగా ఉండదు." అపర్ణ.

"ఏం చేస్తావేంటి?" అపర్ణ

"ముందు ఇంట్లోంచి బయటకు నడు..."

"ఏంటీ న్యూసెన్సు అపర్ణా!" అప్పారావు కలగజేసుకున్నాడు.

"నాదా? చదువుతున్నానని మిడిసిపడుతోంది"

"నా చదువు సంగతి ఎత్తితే మర్యాదగాఉండదు." సుకన్య.

అలా ప్రారంభమైన కీచులాట మాటలు తెగే దాకా వచ్చి, రాకపోకలు బందై – ఆ ఇంటి మీదకాకి ఈ ఇంటిమీద వాలడానికి భయపడే స్థితికి వచ్చింది.

ఆరేళ్ళ నుండి అజాతశత్రువులా ఉన్న ఆ అప్పారావుఒక్కసారి ఆఏరియాలో గర్విష్టిగా – పొగరుబోతుగా – పిసినారిగా ముద్ర పడిపోయాడు.

ఆఫీసులో కూడా అతన్ని వెలేసినట్టు చూడసాగారు,

"విసిఆర్‌ను అమ్మేద్దాం –" ఓ రోజు హఠాత్తుగా చెప్పాడు.

"నాకూ అదే అనిపిస్తుంది, వెధవది - ఇది వచ్చిందగ్గర నుండి అన్నీ కష్టాలే పిల్లలు చదువు పాడైపోయింది, క్యాసెట్లు అద్దెకు ఉన్న డబ్బంతా ఖర్చయిపోతోంది" అపర్ణ చెప్పింది.

"ఇంకో శుభవార్త కూడా ఉంది, మనం ఈ ఊర్నించి ట్రాన్స్‌ఫరై వెళ్ళిపోతున్నాం - "కామ్‌గా చెప్పాడు.

"అరే! ఎప్పుడు అడిగారు?"

"నే నడగలేదు, అభిషేక్‌గారు నాకు తలబిరుసు అని, లంచాలుమేసి విసిఆర్ కొన్నామని, పైగా ఆఫీసు పని ఎగ్గొట్టి విసిఆర్ చూస్తున్నానని పై అధికారులకు చెప్పి ఈ బహుమతి ఇప్పించారు" బాధగా చెప్పాడు.

"పూలమ్మిన చోట కట్టెలమ్మటం కష్టం, అపకారంలో కూడా ఉపకారం చేశాడు మీ ఆఫీసరు." చేసేదిలేక నిట్టూర్చింది అపర్ణ.

(ఆంధ్రప్రభ వారపత్రిక ------)

